# మళ్లీ గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా



పాత మలక్‌పేట డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి బలాల, డివిజన్ అధ్యక్షుడు షఫీ



సంతోషనగర్ ఎంబీ హట్స్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న మజ్లిస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్‌హుస్సేన్ మెరాజ్

మలక్‌పేట, నవంబర్ 7 : కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని ప్రజలు కోరుకున్న విధంగా అభివృద్ధి పరిచానని, మరోసారి గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి అబ్దుల్లా బలాల అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి పాత మలక్‌పేట డివిజన్‌లోని జలాలుద్దీన్ స్వీట్‌హౌస్ నుంచి మూన్‌లైట్ స్కూల్ వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బలాల మాట్లాడుతూ.. 15 ఏండ్లలో ఎన్నడూ చూడనంతగా మలక్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా కృషిచేశానని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించానన్నారు. ఆదరించిన ప్రజలకు సేవ చేశానని .. మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. తారతమ్యాలు లేకుండా నియోజకవర్గ ప్రజలందరికీ సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, కాలనీవాసులు, ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తా..

సైదాబాద్, నవంబర్ 7 : అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తామని యాకుత్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మెరాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంతోష్‌నగర్ డివిజన్ పరిధిలో ఎంబీ హట్స్‌లో ఇంటింటి ప్రచారం కొనసాగించారు. పేదల సమస్యలను పరిష్కరించటంలో ముందుండే తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయటానికి తాను శాయశక్తుల కృషి చేస్తానని, ప్రజలందరి సహకారంతో ముందుకు తీసుకెళ్తాన న్నారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ డివిజన్ ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాకుత్‌పురలో మూడు నామినేషన్లు

సైదాబాద్, నవంబర్ 7 : యాకుత్‌పుర నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మంగళవారం చంపాపేటలోని యాకుత్‌పుర ఆర్వో కార్యాలయానికి ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న జాఫర్ హుస్సేన్ మెరాజ్, ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న అక్రం అలీ ఖాన్, సరిత రెండో సెట్‌లను దాఖలు చేశారు. ఇరువురు అభ్యర్థులు తమ నామినేషన్ల పత్రాలను యాకుత్‌పుర ఆర్వో ఈ.వెంకటాచారికి అందజేశారు.

## మలక్‌పేట-58 ఏసీలో నాలుగో రోజు రెండు నామినేషన్లు



నల్లగొండ చౌరస్తాలోని సర్కిల్ - 6 డీసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మలక్‌పేట నియోజకవర్గం నామినేషన్ కేంద్రం - 58 ఏసీలో నాలుగోరోజు రెండు నా మినేషన్లు దాఖలయ్యాయి. ఆలిండియా మజ్లిస్ యే ఇంక్విలాబ్ యే మిల్లత్ పార్టీ అభ్యర్థిగా చంచల్‌గూడ బాగ్ యే జహరా ప్రాం తానికి చెందిన ఖాజా మొయినుద్దీన్ మంగళవారం ఒక్క నామినేషన్ సెట్ నామినేషన్ దాఖలు చేయగా, సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా చాదర్‌ఘాట్ ఉస్మాన్‌పురకు అంబి హనుమంత్‌రావు ఒక సెట్ దాఖలు చేశారని ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

**- మలక్‌పేట, నవంబర్ 7**



## ఎంబీటీ అభ్యర్థులకు బీ ఫాం అందజేత

చాదర్‌ఘాట్, నవంబర్ 7 : పాతనగరంలోని చంచల్‌గూడ కేంద్రం పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న మజ్లిస్ బచావో తహరీక్ (ఎంబీటీ) అభ్యర్థులను ఎన్నికల్లో రంగంలోకి దింపుతున్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటిస్తున్నారు ఎంబీటీ అధ్యక్షుడు మాజీదుల్లాఖాన్. నిజామాబాద్ అర్బన్ అభ్యర్థిగా మహ్మద్ జహీరుద్దీన్, ఆర్మూర్ అభ్యర్థిగా షేక్ మాజీద్, బహదూర్‌పుర అభ్యర్థిగా సికందర్ల్లాఖాన్, కార్వాన్ అభ్యర్థిగా మహ్మద్ లయాక్‌ను వెల్లడించారు. అభ్యర్థులకు పార్టీ పత్రాలను మాజీదుల్లాఖాన్, మాజీ కార్పొరేటర్ అమ్జదుల్లాఖాన్ అందజేశారు.



ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట

ఆర్కేపురం, నవంబర్ 7: సీఎం కేసీఆర్ ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట వేశారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి. సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లోని వాసవీ కాలనీలోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ సముచిత స్థానం కల్పించారన్నారు. ఆర్యవైశ్యులంతా ఏకతాటిపైకి వచ్చి తనకు మద్దతు తెలిపినందుకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో మానవీయ కోణంలో ఆలోచించి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో రూ.280కోట్ల భారీ నిధులతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. రూ.40కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి రూ.10కోట్లు, రూ.450 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్సీ దయానంద్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌గుప్తా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

## 12న మన్సూరాబాద్‌లో యాదవ సదర్ సమ్మేళనం

మన్సూరాబాద్, నవంబర్ 7: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 12న సాయంత్రం 9 గంటలకు యాదవ సదర్ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పోచబోయిన గణేశ్‌యాదవ్ తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ చింతలకుంటలోని ఈశ్వరమ్మ కాంప్లెక్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మన్సూరాబాద్ చౌరస్తాలో నిర్వహించే సదర్ సమ్మేళనానికి యాదవ కులస్తులు, రాజకీయ ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. సదర్ సమ్మేళనం సందర్భంగా దున్నపోతులను అందంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. దున్నపోతుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, సత్యనారాయణయాదవ్, బొల్లు యాదయ్యయాదవ్, మల్లెల శ్రీనివాస్‌యాదవ్, కేశబోయిన రవియాదవ్, పోచబోయిన జగదీశ్‌యాదవ్, పోచబోయిన శ్రీకాంత్‌యాదవ్, నాగేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీ నగర్ నియోజకవర్గంలో 4 నామినేషన్ల దాఖలు

ఎల్బీనగర్, నవంబర్ 7: ఎల్బీనగర్ నియోజకవర్గంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలో తెలంగాణ రిపబ్లికన్ పార్టీ తరపున చెన్నోజు శ్రీనివాసులు, ధర్మ సమాజ్ పార్టీ తరపున ఎర్గి హనుమంతు, స్వతంత్ర్య అభ్యర్థిగా కె.నాగదేవ, బీజేపీ అభ్యర్థిగా సామ రంగారెడ్డి తరపున గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి పంకజకు అందజేశారు.

### మహేశ్వరంలో 6 నామినేషన్లు..

మహేశ్వరం, నవంబర్ 7: మహేశ్వరంలో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి సూరజ్‌కుమార్ తెలిపారు. బీఎస్పీ పార్టీ అభ్యర్థిగా కొత్త మనోహర్‌రెడ్డి, ధర్మసమాజ్ పార్టీ జి.అమరేందర్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పి.మల్లేశ్, స్వతంత్ర్య అభ్యర్థిగా బి.రాంచరణ్, ఎంఐఎం అభ్యర్థిగా సయ్యద్ ఆజీమ్ ఉద్దీన్, శివసేన నుంచి మహేశ్ కుమార్ నామినేషన్లను దాఖలు చేసినట్లు అధికారి వెల్లడించారు.

## తానా ప్రశంసా పత్రం

సైదాబాద్, నవంబర్ 7 : వందే విశ్వమాతరమ్ కార్యక్రమంలో భాగంగా శత శతక కర్త చిగురుమల్ల శ్రీనివాస్ తెలుగు భాషోద్యమం కోసం శతకాలను గానం చేసినందుకు తానా ని ర్వాహకులు ప్రశంసా పత్రం పంపారని తెలంగాణ జాగృతి మలక్‌పేట కన్వీనర్ తిరునగరి రాధ తెలిపారు. ఉత్తర అమెరి కా తెలుగు సంఘం (తానా), 100 తెలుగు సంఘాల ఆధ్వర్యంలో 100 దేశాలలో శాంతి సద్భావనా యాత్రలో భాగంగా అందజేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. శతకాలను గానం చేసే ఇంతటి బృహత్తరమైన కార్యక్రమంలో భాగస్వాములు చేసి ప్రోత్సహించి ముందుకు నడించిన మోటూరి నారాయణ రావుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ హెరిటేజ్ (ఆయుష్) ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయుర్వేద వైద్యంపై సైదాబాద్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ బోర్డు కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ కాలనీ వాసులు, మహిళలు, సీనియర్ సిటిజన్స్, యువకులకు ఆయుర్వేద వైద్యం ప్రాధాన్యతపై అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు. **- సైదాబాద్, నవంబర్ 7**




# ఆలయాల అభివృద్ధియే.. ప్రభుత్వ లక్ష్యం

సైదాబాద్, నవంబర్ 7 : తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. దూపదీప నైవేద్యం కోసం ప్రత్యేక నిధులను కేటాయించి ఆలయాల్లో పూజలు జరిగే విధంగా అవసరమైన నిధులను నేరుగా ఆలయ కమిటీ అకౌంట్లో జమ చేస్తున్నది. అదే విధంగా ప్రజల్లో భక్తిని పెంచటానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి నిర్విఘ్నంగా కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, సిబ్బందికి ప్రభుత్వ పరంగా వేతనాలను చెల్లిస్తున్నది. నియోజకవర్గ పరిధిలో 34 దేవాలయాలకు ప్రభుత్వం పర్వదినాల సందర్భంగా నిధులను కేటాయిస్తుందని, అదే విధంగా 5 ఆలయాలకు దేవాదాయ శాఖ నుంచి అర్చకులు, సిబ్బందికి జీతాలను అందిస్తుంది. అలాగే మరో 3 ఆలయాలకు దూప దీప నైవేద్యం కింద ప్రతి నెల రూ.10 వేలను దేవాదాయ ధర్మాదాయ శాఖ అందజేస్తున్నది. దీంతో ఆలయాల్లో నిర్విఘ్నంగా పూజలు జరిగేందుకు, ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ఆలయాలను అలంకరిస్తుంది.

### పర్వదినాలకు అధిక ప్రాధాన్యత ..

ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ఆయా వర్గాల పర్వదినాలు, పండుగలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొనే విధంగా ప్రోత్సహిస్తున్నది. మైనార్టీ సోదరులకు క్రిస్మస్, రంజాన్ కానుకలు, దసరా సందర్భంగా మహిళలు జరుపుకొనే బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని బతుకమ్మ చీరలను అందజేస్తున్నది. దీంతో ఆయా వర్గాల పండుగ సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిలను శోభాయమానంగా అలకరిస్తున్నారు. పండుగలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడానికి ఆలయాల్లో దూప, దీప నైవేద్యం కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. హైదరాబాద్ నగరమంటనే గంగా జమునా తహెజిబ్ అంటూ ప్రజల్లో మతసామరస్యాన్ని కాపాడుతూ భిన్నత్వంలో ఏకతత్వాన్ని కొనసాగిస్తుంది.

### అర్చకులకు గౌరవ వేతనాలు..



ప్రభుత్వం ఆలయాల్లో పనిచేసే అర్చకులు, సిబ్బందికి గౌరవ వేతనాలను అందిస్తున్నది. అర్చకుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీతాలను అందిజేస్తున్నది. ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అర్చకుల కష్టాలు తీర్చి సహకారం అందిస్తున్నది. ఆలయ అర్చకుల కోసం జీతాలను అందిస్తూ ప్రభుత్వం ఆదుకొంటున్నది.

**- కాసుల చంద్రశేఖర శర్మ , హరిహర మైసమ్మ క్షేత్రం- ప్రధాన అర్చకులు**



సైదాబాద్ శ్రీవిజయ దుర్గాదేవి ఆలయం (ఫైల్)